


కాలుష్యం కోరలు చాపుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయాన్ని బలంగా నమ్మిన చిత్తూరు యువకుడు తిరువేలన్ వినాయక విగ్రహాల తయారీలో పర్యావరణానికి పెద్దపీట వేస్తున్నాడు. స్థానిక సప్తకన్నికల ఆలయ సమీపంలో బెంగాల్‌కు చెందిన యువ కళాకారులతో కలసి మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నాడు. బంకమట్టి, రంపపు పొట్టు, వరి పొట్టు, తౌడు, పాత కాటన్ చీరలు ఉపయోగించి ప్రజలు అడిగిన సైజుల్లో విగ్రహాలను రూపొందిస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు.

- చిత్తూరు కల్చరల్

మట్టి వినాయకా నమోస్తుతే..!

● పర్యావరణ హితంగా విగ్రహాల తయారీ



పెద్దిరెడ్డికి ఊచలు లెక్కపెట్టే

సమయం దగ్గరపడింది



బస్సు నడుపుతున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బస్సులు



● 5న పుంగనూరు పర్యటనలో లెక్క తేలుస్తా
● రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి
● చిత్తూరులో 17 ఆర్టీసీ బస్సుల ప్రారంభం

చిత్తూరు రూరల్, ఆగస్టు 3 : 'పెద్ద రెడ్డో.. చిన్న రెడ్డో ప్రజలకు అన్యాయం చేసిన ఎవరైనా ఊచలు లెక్క పెట్టాల్సిందే. అదే మాదిరిగానే పెద్దిరెడ్డి తాను చేసిన పాపాలకు ఊచలు లెక్కపెట్టే సమయం దగ్గర పడింది' అని రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఈ నెల 5వ తేదీన పుంగనూరు పర్యటనలో ఆయన పాపాలను వెలికితీస్తానని చెప్పారు.శనివారం చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన 17 నూతన బస్సులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా పుంగనూరు పరిణామాల నేపథ్యంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డిపై చర్యలు తీసుకోనున్నారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అతి త్వరలో అమలు చేస్తామని తెలిపారు.గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసిందన్నారు. ఒక్క బస్సు కూడా కొనలేకపోయిందని తెలిపారు. ఆర్టీసీని గాడిలో పెట్టడమే తక్షణ కర్తవ్యంగా తమ ప్రభుత్వం చేస్తోందన్నారు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత 1,400 కొత్త బస్సులు కొనుగోలు చేశామని, అందులో 400 రోడ్లపై తిరుగుతున్నాయని చెప్పారు. రానున్న ఐదేళ్లలో రోడ్లపై ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, పుంగనూరు ఇన్‌చార్జ్ చల్లా బాబు, ఆర్ఎం జితేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

చిత్తూరుకు 8.. అన్నమయ్య జిల్లాకు 9 సర్వీసులు

మంత్రి ప్రారంభించిన 17 ఆర్టీసీ సర్వీసుల్లో చిత్తూరు 2డిపోకు 5, చిత్తూరు 1 డిపోకు 1, కుప్పం 2 డిపోకు 2 కేటాయించారు. అన్నమయ్య జిల్లాకు చెందిన మదనపల్లి 1 డిపోకు 2, 2డిపోకు 3, పీలేరు 3, రాజంపేట 1 మొత్తం 9 సర్వీసులు కేటాయించారు.

50 రోజుల్లోనే చిత్తూరుకు 8 బస్సులు

గత ఐదేళ్లలో వైసీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి సొంత ప్రాంతానికి ఏమీ చేయలేదని, టీడీపీ అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లోనే చిత్తూరు 1, 2 డిపోలకు 8 కొత్త సర్వీసులను తీసుకొచ్చానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. మరికొన్ని తీసుకొచ్చి గ్రామీణులకు ఇబ్బంది లేకుండా చేస్తానని అన్నారు.

● బస్సు నడిపిన ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవం తర్వాత ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ బస్సు నడిపారు. బస్సులో చిత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే ఛాంబర్ ప్రారంభోత్సవం, మండల మీట్‌కు కలెక్టర్‌తో పాటు జేసీ, ఇతర ప్రజాప్రతినిధులను తీసుకొచ్చారు.

అమ్మ మురళీ..!

● పప్పుబెల్లాల్లా పట్టాలమ్ముకున్న చిత్తూరు పూర్వ తహసీల్దార్
● ఎన్నికలకు ముందు 450 మందికి పట్టాల జారీ
● ఒక్కొక్కరి వద్ద రూ.20 వేలు నుంచి రూ.50 వేల వరకు వసూలు
● ఒకరికిచ్చిన భూమి మరొకరికి కేటాయింపు



మురళీమోహన్

చిత్తూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు చిత్తూరు తహసీల్దార్‌గా పనిచేసిన మురళీమోహన్ ఇష్టానుసారం ఇంటి పట్టాలు పంపిణీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సాధారణంగా ఓ వ్యక్తికి ఇంటి పట్టా ఇవ్వాలంటే ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఉన్నతాధికారులు పరిశీలించి దరఖాస్తుదారుడి అర్హత, అందుబాటులో ఉన్న భూమిని బట్టి పట్టా మంజూరు చేస్తారు. వీఆర్వో, ఆర్ఐ, డీటీ, తహసీల్దార్ ఇలా అన్ని స్థాయిల్లోనూ అప్రూవ్ అవుతుంది. తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డుల్లో ఫలానా వ్యక్తికి పట్టా ఇచ్చినట్లు నమోదు చేసుకుంటారు. కానీ మురళీమోహన్ ఇదంతా పాటించలేదు. ఎన్నికల కోడ్ వచ్చాక అతన్ని నంద్యాలకు బదిలీ చేశారు. ఆ సమయంలోనే ఆయన ఈ పట్టాల కుంభకోణానికి పాల్పడ్డారు. వీఆర్వో, ఆర్ఐ, డీటీలకు ఏ మాత్రమూ తెలియకుండా నేరుగా చేత్తో రాసేసి సుమారు 450 మందికి పట్టాలు పంపిణీ చేశారు. వీటికి సంబంధించిన సమాచారం తహసీల్దార్ కార్యాలయంలో ఎక్కడా నమోదు చేయలేదు. కార్యాలయంలో పనిచేసే ఓ మహిళా ఉద్యోగి పట్టాలను తయారు చేయగా, ఆయన సంతకాలు పెట్టి పంచారు. ఒక్కో పట్టా కోసం రూ. 20 వేల నుంచి రూ.50 వేల వరకు తీసుకున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా రూ.1.50 కోటి వెనకేసుకున్నట్లు సమాచారం.


ఏ పట్టాకూ భూమి లేదు

ఆయన పంపిణీ చేసిన ఏ పట్టాకు ఫీల్డ్ మీద భూమి లేదు. అప్పటికే ఒకరి పేరుతో ఉన్న భూమికి మరొకరి వద్ద డబ్బు తీసుకుని పట్టా అందించినట్లు తెలుస్తోంది. దీంతో పాత పట్టా, తాజా డమ్మీ పట్టా ఉన్నవారు ఘర్షణలకు దిగుతున్నారు. ఇలా ఘర్షణలు పడిన వారంతా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌డేలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మరికొందరు పోలీస్‌స్టేషన్లకు తిరుగుతున్నారు. దీంతో ఉన్నతాధికారులు ప్రాథమికంగా విచారిస్తే నిజమేనని తెలిసింది. ఈ వ్యవహారంలో ఒకరిద్దరు వైసీపీ నేతలు మధ్యవర్తులుగా వ్యవహరించనట్లు సమాచారం. తాజాగా అన్ని మండలాల్లోనూ తహసీల్దార్లను నియమించారు. ఎన్నికలకు నంద్యాల వెళ్లి తిరిగొచ్చిన ఈయనకు మాత్రం ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా కలెక్టరేట్‌లోనే పెట్టారు. త్వరలో పూర్తిస్థాయి విచారణ చేపట్టి, చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.



కోనేరులో పడి అవ్వామనవళ్ళ మృతి

సదుం, ఆగస్టు 3: ఆలయ కోనేరులో పడి అవ్వా, మనవడు మృత్యుపాలైన ఘటన శనివారం సదుంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పీలేరుకు చెందిన తులసమ్మ(55) తన పుట్టిన ఊరు సదుం పంచాయతీ కొత్తపల్లెలో ఇల్లు నిర్మించుకుని కొన్ని రోజులుగా ఉంటోంది. ఆమె కుమారుడు చరణ్ తిరుపతిలో ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నాడు. మనవడు అద్విక్(3) కొన్ని రోజులుగా ఆమె వద్దనే ఉంటున్నాడు. శనివారం మనవడిని తీసుకుని స్థానిక విరూపాక్షమ్మ ఆలయానికి వెళ్లింది. ఆమె కొంత ఏమరుపాటుగా ఉండడంతో పక్కనే ఉన్న కోనేరు దగ్గరకు వెళ్లిన అద్విక్ అందులో పడిపోయాడు. వెంటనే తేరుకున్న తులసమ్మ మనవడి కోసం కోనేటిలోకి దూకింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఈత రాక ఇద్దరూ మృత్యుపాలయ్యారు. ఇద్దరి మృతదేహాలను స్థానికులు బయటకు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై వివరాలు సేకరిస్తున్నారు.





తులసమ్మ - అద్విక్ (ఫైల్ ఫొటోలు)

ఆదివారం ప్రత్యేకం

తిరుమల తిరుపతి దేవస్థానాల ఈవో అన్నది ఒక విశేషమైన హోదా. ఒక పవిత్రమైన బాధ్యత. ఐఏఎస్ కెరీర్‌లో అరుదైన అవకాశం. దేశం నలుమూలలనుంచీ వచ్చే భిన్న ప్రాంతాల, భిన్న భాషల, భిన్న ఆహారపు అలవాట్లున్న భక్తులకు అసౌకర్యం కలుగకుండా సంతృప్తికరంగా శ్రీవారి దర్శనం చేయించడం నిత్య సవాలు. తిరుమలలో చిన్న కదలిక కూడా జాతీయ వార్తగా వైరల్ అయిపోతుంది. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ సకల విభాగాల యంత్రాంగాలనూ నడిపించాలి. టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన జె.శ్యామలరావు నెలన్నరగా తిరుమల అంతా సుడిగాలిలా తిరిగారు. ప్రతిదీ ప్రత్యక్షంగా పరిశీలించి ఆనుపానులు తెలుసుకున్నారు. ఆ తర్వాతే సమీక్షలకు దిగి సరిదిద్దే చర్యలకు ఉపక్రమించారు. పరిశీలన, అవగాహన, గుర్తించిన లోపాలు, చేయబోయే మార్పుచేర్పుల గురించి ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా సంభాషించారు. అందులోని ముఖ్యాంశాలు....

- తిరుమల, ఆంధ్రజ్యోతి

■ ఇంటర్వ్యూ



టీటీడీకి పటిష్ఠమైన ఐటీ అవసరం

జె.శ్యామలరావు

1997 బ్యాచ్ ఐఏఎస్, సొంతూరు కాకినాడ. 11ఏళ్లు అసోంలో విధులు. 2009-11 మధ్య విశాఖ కలెక్టర్‌గా బాధ్యతలు. మెడికల్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ బోర్డులకు ఎండీగా చేశారు. కమర్షియల్ టాక్స్ జీఎస్టీ కమిషనర్‌గానూ, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ కార్యదర్శిగానూ విధులు నిర్వహించారు. ఉన్నత విద్యాశాఖ నుంచి టీటీడీ ఈవోగా జూన్ 16న వచ్చారు.

- లడ్డూ, అన్నప్రసాదాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి
- క్యూలైన్లలో భక్తులకు అవస్థల్లేకుండా చర్యలు

వారాంతపు క్యూలైన్లపై ప్రత్యేక శ్రద్ధ

ఎక్కువమంది భక్తులు సంతృప్తికరంగా శ్రీవారిని దర్శించుకునేలా చేయడమే నా ప్రథమ ప్రాధాన్యం. ఎలాంటి ప్రణాళికలు లేకుండా వచ్చే భక్తులతోనే క్యూలైన్లు పెరిగిపోతున్నాయి. వారాంతపు క్యూలైన్లలో భక్తులు ఇబ్బందిపడకుండా నారాయణగిరిలో అదనపు షెడ్ నిర్మించాలని నిర్ణయించాం. ఇక్కడ 5నుంచి 6వేల మంది భక్తులు కూర్చోవచ్చు.ఆలయంలో సేవలు, కైంకర్యాల్లో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకుంటే అధిక సంఖ్యలో భక్తులకు దర్శనం కల్పించవచ్చని అర్థమయ్యింది. ఆధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా క్యూలైన్లలో భక్తుల కదలికలను పరిశీలించి సంఖ్యను నియంత్రించవచ్చు. ఇక, భక్తులు అధిక సమయం క్యూలైన్‌లో నిలబడి ఇబ్బందిపడే అవసరం లేకుండా స్లాటెడ్ సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్లు వారానికి 1.47 లక్షలకు పెంచాం. దీనిని గతంలోలా 1.67 లక్షలకు పెంచుతాం. ఈవోగా బాధ్యతలు చేపట్టిన వెంటనే బయటకు వ్యాపించిన క్యూలైన్లను తనిఖీ చేసినప్పుడు చాలా లోపాలు కనిపించాయి. అక్కడ అందించే ఆహారపదార్థాల నాణ్యత బాగాలేదని, కనీసం తాగు నీరు ఇచ్చే వాళ్లు కూడా లేరని, సమస్య చెప్పుకుందామని చూస్తే అందుబాటులో ఏ అధికారీ లేరనే ఫిర్యాదులు వచ్చాయి. పిల్లలకు పాలు అందడం లేదని ఓ భక్తురాలు నా దగ్గరకు వచ్చి ఏడ్చింది. సీఎంగారు కూడా ఇవే సమస్యల మీద దృష్టి పెట్టమని చెప్పారు. అన్నప్రసాదాల వితరణకు ఓ పద్ధతి ప్రకారం వ్యవస్థ లేదని గుర్తించా. ఈ క్రమంలో బయటికి వ్యాపించిన క్యూలైన్లు, నారాయణగిరి షెడ్లలో నిరంతరాయంగా ఆహార పదార్థాలు అందించేందుకూ, అందేలా పర్యవేక్షించేందుకూ ప్రత్యేకంగా ముగ్గురు ఏఈవో స్థాయిల్లో అధికారులను మూడు షిఫ్టుల్లో ఉండేలా నియమించా. అలాగే బయట క్యూలైన్ మొత్తానికి కలిపి 3 శాశ్వత ఫుడ్‌కౌంటర్లు ఏర్పాటు చేశాం. వారాంతాల్లో పర్యవేక్షణకు ఎస్వీబీసీ సీఈవోకు అదనపు బాధ్యతలు అప్పగించాం. ఫుడ్ పెట్టడం లేదనే విమర్శలకు అవకాశం ఇవ్వకుండా ఎక్కడ, ఎప్పుడు ఫుడ్ అందించామనే సమాచారం తెలిసేలా జీపీఎస్ ఇనేబుల్ కెమెరాల ద్వారా తీసిన ఫొటోలు సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేసే వ్యవస్థను తీసుకువచ్చాం. బయటి క్యూలైన్ల వద్ద మరుగుదొడ్ల సమస్యను అధిగమించేందుకు మొత్తం ఆరు టాయిలెట్లు భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చాం.

పారిశుధ్య నిర్వహణ తీరు మారాలి

ప్రస్తుతం పారిశుధ్య నిర్వహణ సంతృప్తికరంగా లేదు. కాంట్రాక్టర్లు సరిపడినంతమంది సిబ్బందిని పెట్టడం లేదు, కావాల్సిన మెటీరియల్ ఇవ్వడం లేదు. పనితీరుపై పర్యవేక్షణ ఇప్పటి వరకు లేకుండా పోయింది. ఈ పరిస్థితులు గమనించి మార్పులు చేస్తున్నాం. మొహమాటాలకు తావులేదు.పారిశుధ్యం సరిగా లేకపోతే కాంట్రాక్టు రద్దుచేస్తామని హెచ్చరిస్తున్నాం.

మరింత శుద్ధజలం

తిరుమలలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల నిషేధం తర్వాత చాలా మంది భక్తులు జలప్రసాద కేంద్రాలపై ఆధారపడుతున్నారు.ఎప్పటికప్పుడు జలప్రసాద కేంద్రాల నుంచి శాంపిల్స్ తీసుకుని పరీక్షిస్తున్నాం.అలాగే గాజుబాటిళ్ల విక్రయంలో దుకాణదారుల తీరుపై వస్తున్న విమర్శలు పరిశీలించి హెచ్చరించాం. నిబంధనలను ఉల్లంఘిస్తే దుకాణాలను సీజ్ చేస్తాం. నీటి సరఫరాకు ప్రముఖ సంస్థలను కూడా ఆహ్వానిస్తున్నాం. ప్రస్తుత ధరకే విక్రయించేందుకు ముందుకు వస్తే లైసెన్సులను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తాం.

కాలినడక భక్తులకు టోకెన్లు

గతంలో అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గాల్లో నడిచివచ్చే భక్తులకు ప్రత్యేకంగా దివ్యదర్శనం టోకెన్లు ఇచ్చేవాళ్లు. అయితే వాటిని తొలగించారు. నేను వచ్చాక శ్రీవారిమెట్టులో తిరిగి టోకెన్లు జారీ చేస్తున్నాం. అలిపిరి మార్గంలో కూడా ఇవ్వాలంటూ చాలామంది అడుగుతున్నారు. అయితే ఇప్పటికే చాలా రకాల దర్శనాలు అమల్లో ఉన్నాయి. ఈ క్రమంలో వీటి జారీ వల్ల ఏదైనా సమస్య వస్తుందా అనే అంశాన్ని పరిశీలిస్తున్నాం. ఆలయ క్యూలైన్ల నిర్వహణ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత ఈ మార్గంలో టోకెన్ల జారీపై దృష్టిపెడతాం. స్థానికులకు దర్శనం కల్పించడంపై కూడా త్వరలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

ఆర్గానిక్ నైవేద్యాల రుచిపై ఫిర్యాదులు

శ్రీవారికి నివేదించే నైవేద్యాలను ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చే ముడి సరుకులతో సమర్పించాలని గతంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ ప్రసాదాలు రుచికరంగా లేవనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై కూడా చర్చించాం. అసలు టీటీడీకి అందుతున్నవి ఆర్గానిక్ ముడిసరుకులేనా కాదా, వాటి నాణ్యత ఎలా ఉందని పరీక్షించేందుకు ల్యాబ్‌కు పంపే ఏర్పాట్లు చేస్తున్నాం. కుకింగ్‌లో మార్పులు తీసుకురావాలనే సూచనలు వచ్చాయి. పరిశీలిస్తున్నాం.

అన్నదానంలో మోడరన్ కిచెన్

అన్నప్రసాదాల్లోని అన్నం ముద్ద కడుతోందని, బియ్యంలో నూకలు కలుస్తున్నాయని చాలా ఫిర్యాదులున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇటీవల ఏపీ, తెలంగాణ రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులతో సమీక్ష నిర్వహించాం. నాణ్యత పర్యవేక్షణకు ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన చేశాం. అసోసియేషన్ నుంచి ఒకరు,టీటీడీ అన్నప్రసాద విభాగం నుంచి ఒకరు, కొనుగోళ్ల విభాగం నుంచి మరొకరు బియ్యం నాణ్యతను నిత్యం పరిశీలిస్తారు. నాణ్యత లేదని స్పష్టమైతే ఆ బియ్యం ఏ రైస్‌మిల్ నుంచి వచ్చిందో గుర్తించి ఆ మిల్లర్‌పై అసోసియేషన్ నిషేధం విధించాలని కోరాం. దానికి అసోసియేషన్ సభ్యులు కూడా అంగీకరించారు. అలాగే వెంగమాంబ అన్నప్రసాద భవనంలో భక్తులకు సంతృప్తికరంగా నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో అన్నప్రసాదాలు అందించేందుకు అతిపెద్ద క్యాటరింగ్ సర్వీస్ సంస్థ 'కాంపస్' సహకారం తీసుకోబోతున్నాం. స్టోర్, కిచెన్, పారిశుధ్యం, సర్వింగ్, ట్రాన్స్‌పోర్టు ఇలా అన్నిటిలోనూ వాళ్లు కొన్ని సూచనలు చేస్తారు. వీళ్లు ఉచితంగానే ఈ సేవలను టీటీడీకి అందించబోతున్నారు. అన్నప్రసాదాల నాణ్యత పెంపుకోసం ఫుడ్‌టెక్నాలజీ, హోటల్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ నిపుణులతో కూడా చర్చించాం.వంటశాలలో ఉన్న పాత యంత్రాలను తొలగించి అత్యాధునిక యంత్రాలు ఏర్పాటు చేస్తాం. సిబ్బందిని కూడా సరిపడా పెంచుతాం. రానున్న 25 ఏళ్ల వెనక్కి తిరిగి చూసే అవకాశం లేకుండా ఆధునాతన కిచెన్‌ను సిద్ధం చేస్తాం.

ఐటీ విభాగం వీక్

దర్శనం, వసతి, ఆర్జితసేవల ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ తీరును పరిశీలిస్తున్నాం. ముఖ్యమైన ఐటీ విభాగం చాలా బలహీనంగా ఉంది. ఐటీలోని లోపాలను అవకాశంగా మార్చుకుని ఒకే మొబైల్, ఈమెయిల్ ద్వారా వందల సంఖ్యలో లక్కీడిప్ కోసం రిజిస్ట్రేషన్లు చేసుకోవడాన్ని గమనించాం. వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేసుకుని దర్శనాలు, సేవలు పొందుతున్నారు. అలాగే నకిలీ ఆధార్ నెంబర్లతోనూ టికెట్లు, గదులు తీసుకుంటున్నారు. శ్రీవాణి టికెట్లు కూడా ఫేక్ ఐడీలతో బుక్ చేస్తున్నారు. ఇప్పటికే పలు ఫోన్‌నెంబర్లను, మెయిల్స్‌ను బ్లాక్ చేయడంతో పాటు ఫేక్ ఆధార్ నెంబర్లతో, ఒకే నెంబరు, మెయిళ్ల ద్వారా చేసుకున్న కొన్ని బుకింగ్స్‌ను రద్దు చేశాం. ఇక, ఫేక్ ఆధార్‌లను అరికట్టేందుకు ఆధార్ సంస్థ ప్రతినిధులతో కూడా మాట్లాడాం. ప్రత్యేకంగా తయారు చేసిన అప్లికేషన్‌తో ఆధార్ నిజమైనదా కాదా అని నిర్ధారించుకునే వ్యవస్థను మరో 20 రోజుల్లో ఏర్పాటు చేయబోతున్నాం. ఐడీని మార్చడం పెద్ద క్రైం. ఎట్టిపరిస్థితిలో వీళ్లను విడిచిపెట్టకూడదు. భవిష్యత్తులో ఐటీ విభాగాన్ని పటిష్ఠం చేసి అక్రమాలకు అవకాశం లేకుండా చేస్తాం. అనుభవం కలిగిన మంచి అధికారి పర్యవేక్షణలోకి ఐటీ విభాగాన్ని తీసుకురాబోతున్నాం. ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీలో దళారీలను అరికట్టేందుకు ఫొటోతో టోకెన్ ఇచ్చే విధానాన్ని కూడా అమలుచేస్తున్నాం.

లడ్డూకి పూర్వ వైభవం : లడ్డూ నాణ్యత పెంపుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. పోటు కార్మికులు, అధికారులు, గతంలో పనిచేసి వెళ్లిన అధికారులతో సమీక్షలు నిర్వహించాం. లడ్డూ తయారీలో ముఖ్యమైనది నెయ్యి. రుచి, సువాసన రావాలంటే నాణ్యమైన నెయ్యి ఉండాలి. గతంలోకన్నా ఇప్పుడు వాడుతున్న నెయ్యి నాణ్యతలో లేదావుందని గుర్తించాం. ఇకపై క్వాలిటీ నెయ్యి రావాలని సంబంధిత టెండరుదారులను హెచ్చరించాం. కల్తీ నెయ్యిని సరఫరా చేస్తున్న ఓ సంస్థపై నిషేధం విధించాం. అత్యున్నత ప్రమాణాలతో ప్రత్యేకమైన ల్యాబ్‌ను తిరుమలలోనే ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తున్న ముడిసరుకుల నాణ్యతను పరిశీలిస్తాం. మంచి నాణ్యమైన సరుకులు వినియోగించడం ద్వారా లడ్డూకి పూర్వవైభవం తీసుకురావచ్చు.

పలమనేరు సీఐ తీరుపై టీడీపీ నిరసన

- స్టేషన్ ముందు ధర్నా
- జాతీయ రహదారిపై రాస్తారోకో





జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న టీడీపీ నాయకులు, సీఐ చంద్రశేఖర్‌ను నిలదీస్తున్న టీడీపీ నాయకులు

పలమనేరు, ఆగస్టు3 : పలమనేరు సీఐ చంద్రశేఖర్ తీరును నిరసిస్తూ శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు పోలీసు స్టేషన్ ముందు బైఠాయించారు. సీఐ చంద్రశేఖర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శనివారం ఉదయం పలమనేరు మండలం కూర్మాయి వద్ద కౌండిన్య నదిలో ముడివారిపల్లికి చెందిన పెద్దబ్బ గృహ అవసరాలకోసం రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా సీఐ చంద్రశేఖర్ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని ఎస్ఈబీ అధికారులకు అప్పగించారు. ఎస్ఈబీ అధికారులు ఆ ట్రాక్టర్లను పలమనేరు ఆర్టీసీ డిపో ఆవరణలో ఉంచారు. విషయం తెలుసుకొన్న పెద్దబ్బ పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పలమనేరు స్టేషన్ ముందు బైఠాయించారు. సీఐ చంద్రశేఖర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గంగవరం సీఐ చిన్నగోవిందు, గంగవరం రూరల్ సీఐ కృష్ణమోహన్ ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో అక్రమార్కులపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఇప్పుడు తాము ఇళ్ల కోసం ఇసుక తరలిస్తున్నా అడ్డుకోవడం తగదన్నారు. పోలీసులు స్పందించక పోవడంతో జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకోకు దిగారు. ఫలితంగా జాతీయ రహదారిపై ఇరువైపులా, మరోవైపు బస్టాండు నుంచి బస్సులు వెలుపలికి రాలేక నిలిచిపోయాయి. గంట పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. చివరకు పోలీసులు ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులను స్టేషన్ వద్దకు పిలిపించారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి సీఐ చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని గంగవరం, గంగవరం రూరల్ సీఐలు చిన్నగోవిందు, కృష్ణమోహన్‌లకు వినతిపత్రం అందజేశారు. ట్రాక్టర్లను విడిచిపెట్టాలని కోరడంతో ఇసుక ట్రాక్టర్లను, ట్రాక్టర్ డ్రైవర్లను వదిలేశారు. దీంతో నాయకులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిషోర్‌గౌడు, సోమశేఖర్‌గౌడు, నాగరాజరెడ్డి, నాగరాజు, ఖాజాపీర్, బాలాజినాయుడు, జగదీష్‌నాయుడు, సెల్వరాజ్, రామచంద్రనాయుడు, వెంకటమునిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి బాధితులు ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తాం

- మంత్రి రాంప్రసాద్ హామీ

చిత్తూరు సిటీ, ఆగస్టు 3: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వల్ల నష్టపోయిన బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే న్యాయం చేసేందుకు కృషి చేస్తామని మంత్రి రాంప్రసాద్ హామీ ఇచ్చారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ పెద్దిరెడ్డి కుటుంబం వల్ల చాలా మంది వారి విలువైన భూములు పోగొట్టుకున్నారన్నారు. పుంగనూరు, పీలేరు, మదనపల్లెలో పర్యటిస్తుంటే అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని, వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో పార్టీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా బాబు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత, నేతలు కాజూరు బాలాజీ, త్యాగరాజన్, వసంత్‌కుమార్, మోహన్‌రాజ్, జయచంద్రనాయుడు, మాపాక్షి వెంకటేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీల్లో మార్పులు..చేర్పులు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 3: తహసీల్దార్ల బదిలీల్లో శనివారం మార్పులు చేర్పులు చోటుచేసుకున్నాయి. కేటాయించిన మండలాల్లో చేరేందుకు కొందరు విముఖత చూపగా, మరికొందరి నియామకాలను స్థానిక ప్రజాప్రతినిధులు వ్యతిరేకించడంతో పునఃబదిలీలు చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. శాంతిపురం తహసీల్దార్‌గా నియమితులైన కె.అమరనాథ్‌ను అన్నమయ్య జిల్లాకు కేటాయించారు.అన్నమయ్య జిల్లానుంచి చిత్తూరు జిల్లాకు బదిలీపై వచ్చిన జె.రామును పుంగనూరు తహసీల్దార్‌గా నియమించారు. అక్కడ పనిచేస్తున్న జి.శివయ్యను చిత్తూరు కలెక్టరేట్‌కు రిపోర్టు చేసుకోవాలన్నారు. వెదురుకుప్పం రీసర్వే డీటీ ఆర్.జయంత్ కుమార్‌ను తిరుపతి జిల్లాకు, ఏర్పేడు మండల డీటీ ఐ.శ్రావణ్ కుమార్‌ను చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. కలెక్టరేట్ ఏవో పార్థసారథిని యాదమరి తహసీల్దార్‌గా, కలెక్టర్ సీసీ, డీఎస్వో ఆఫీసు డీటీ హుస్సేన్‌ను సదుం తహసీల్దార్‌గా నియమించారు. విజయపురం తహసీల్దార్ మాధవరాజును తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు బైరెడ్డిపల్లి తహసీల్దార్‌గా నియమించారు. సదుం తహసీల్దార్ బి.కులశేఖర్‌ను చిత్తూరు కలెక్టరేట్ ఏవోగా, ఇదివరకు కలెక్టరేట్ ఏవోగా ఉన్న టి.సీతారామ్‌ను కుప్పం ఆర్డీవో కార్యాలయ డివిజనల్ పరిపాలనాధికారిగా నియమించారు. రొంపిచెర్ల డీటీ డి.లోకేష్‌ను తిరుపతి జిల్లాకు, తంబళ్లపల్లి మండలం రీసర్వే డీటీ జి.ఇషాక్‌ను చిత్తూరు జిల్లాకు బదిలీ చేసి, రొంపిచెర్ల తహసీల్దార్‌గా నియమించారు. తిరుపతి జిల్లా డీఎస్వో కార్యాలయ డీటీ పూజారి శ్రీనివాసులును అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారు.

నీటి కాలుష్యానికి పాల్పడితే కఠిన చర్యలు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 3: నగరి పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న డయ్యింగ్ యూనిట్ల కారణంగా నీటి కాలుష్యం ఏర్పడుతోందని స్థానిక ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారని, అట్టి యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ నగరి, చుట్టుపక్కల ప్రాంతాల్లో నిర్వహిస్తున్న డయ్యింగ్ యూనిట్ల ద్వారా విడుదలవుతున్న నీటి వల్ల దిగువ ప్రాంతాలైన నింద్ర, విజయపురం మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నాలుగు నెలల్లో మెకనైజ్డ్ డయ్యింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి పురోగతిని జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. డీఐసీ జీఎం చంద్రశేఖర్, ఏజీఎం భార్గవి, నగరి మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పాల్గొన్నారు.

చెన్నై రేలా ఆసుపత్రి ద్వారా విశిష్ట వైద్యం

- నెల్లూరులో మెడికల్ సెంటర్ ప్రారంభించిన డాక్టర్ రేలా



మాట్లాడుతున్న డాక్టర్ రేలా

నెల్లూరు(వైద్యం), ఆగస్టు3: చెన్నై రేలా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా ఇక నుంచి నెల్లూరు జిల్లా ప్రజలకు విశిష్ట వైద్య చికిత్సలు అందించనున్నట్లు ఆ ఆసుపత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మొహ్మద్ రేలా తెలిపారు. నెల్లూరు నగరంలో ఏర్పాటు చేసిన రేలా మెడికల్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఇప్పటి వరకు చెన్నై రేలా ఆసుపత్రి ద్వారా 3వేల కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేశామన్నారు. మెర్సీ కిల్లింగ్‌కు కోర్టును ఆశ్రయించిన చిత్తూరు జిల్లాకు చెందిన 2 నెలల చిన్నారి జ్ఞానసాయికి 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో కాలేయ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా చేశామని తెలిపారు. ప్రస్తుతం ఆ చిన్నారికి 8 ఏళ్ల వయసు వచ్చిందన్నారు. అలాగే పలు విభాగాల వ్యాధుల నివారణలో చెన్నై రేలా ఆసుపత్రి ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు ఆసుపత్రి ప్రారంభోత్సవంలో చిన్నారి జ్ఞానసాయి పాల్గొని డాక్టర్ రేలాకు పుష్పగుచ్ఛం అందించింది. అనంతరం పలు విభాగాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాస్కులర్ సర్జన్ డాక్టర్ సీఎంకే రెడ్డి, పలువురు వైద్య నిపుణులు పాల్గొన్నారు.

ఐదుగురు సీఐల బదిలీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 3: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు డీఐజీ శనివారం ఉత్తర్వులు జారీ చేసారు. ఈ మేరకు తిరుపతి క్రైం స్టేషన్‌లో పనిచేస్తున్న రామకృష్ణను అన్నమయ్య జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. శ్రీసిటీలో పనిచేస్తున్న చిన్నపెద్దయ్యను అన్నమయ్య జిల్లా క్రైం స్టేషన్‌కు, తిరుమల సీసీఎస్‌లో పనిచేస్తున్న రెడ్డి శేఖర్ రెడ్డిని కలికిరికి, తిరుపతి ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న చాంద్ బాషాను మదనపల్లె వన్‌టౌన్‌కు, పాకాలలో పనిచేస్తున్న రాజగోపాల్‌ను బద్వేలుకు బదిలీ చేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

బీసీ హాస్టల్‌కు వంటసామగ్రి వితరణ



వంట సామగ్రికి పూజ చేస్తున్న మున్సిపల్ కమిషనర్, సునీల్ రాజ్ తదితరులు

కుప్పం, ఆగస్టు 3: కుప్పంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహానికి శనివారం బీసీఎన్ చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో, లయన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో వంటసామగ్రిని వితరణ చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా వీటిని అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల ద్వారా పేద పిల్లలకు అండగా ఉంటున్న కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సలహాదారు ఎ.మహేశ్, మాజీ అధ్యక్షుడు సత్యేంద్రశేఖర్, కార్యదర్శి సెంథిల్, డైరెక్టర్లు శివశంకర్, సుబ్రమణ్యం, సభ్యుడు గిరిధర్, మణి, స్థానిక నాయకులు రాజేశ్, వార్డెన్ మురళినాయక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటితో విద్యా సంస్థల అభివృద్ధి



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, ఆగస్టు 3: కుప్పంలోని ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతి గృహాలను రూ.1.02 కోట్లతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చెప్పారు. కుప్పంలోని ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం ఆయన ప్రభుత్వం నుంచి వచ్చిన ఉచిత పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కుప్పం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక ఆడిటోరియం, ఆటస్థలం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుకు కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పల్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, అధ్యాపకుడు జగదీశ్‌బాబు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం

పుంగనూరు రూరల్, ఆగస్టు 3: ఈనెల 5వతేదీ పుంగనూరులో మంత్రి రాంప్రసా ద్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేద్దామని మండల టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన టీడీపీ కార్యక ర్తల సమావేశంలో మాట్లాడారు. బైక్ ర్యాలీ, పతాకావిష్కరణ ఉంటుందన్నారు. తర్వాత కూటమి నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారన్నారు. అనంతరం పుంగనూరు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వ హిస్తారని వివరించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సీవీరెడ్డి, కృష్ణానా యక్, వెంకటరెడ్డి, గంగులప్ప, గంగాధర్, ప్రసాద్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: మంత్రి రాంప్రసాద్‌రెడ్డి స్థానిక బస్టాండ్‌లో జెండా ఆవిష్కరణ చేస్తారని నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, యువనాయకులు ప్రదీప్‌రాజు కోరారు.

కల్లూరు: పులిచెర్ల మండలంలో మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జడ్పీటీసీ సభ్యులు మురళీధర్, రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శి వెంకటరమణ తెలిపారు. కల్లూరులో మండల స్థాయి టీడీపీ సమావేశంలో వారు మాట్లాడారు.

ట్యాంక్‌బండ్‌పై వ్యర్థాల తొలగింపు



ట్యాంక్ బండ్ వద్ద వ్యర్థాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు, ఆగష్టు3 : పలమనేరుకు ఆనుకొని ఉన్న పెద్దచెరువు కట్టపై వెళ్లే జాతీయ రహదారి పక్కన ఉన్న వ్యర్థాలను శనివారం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పరిశీలించారు. వెంటనే వ్యర్థాలను తొలగింపజేశా రు. అనంతరం పెద్ద చెరువు వద్ద నిర్మించ తలపెట్టిన మురుగునీటి ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు. ఎస్‌టీపీ ఏర్పాటుకు తగిన ఆదేశాలను అసిస్టెంట్ ఇంజినీర్ ఎన్. రూపేష్‌కు ఇచ్చారు. అలాగే మదనపల్లి రోడ్డుపక్కన ఉన్న పెద్ద కాలువను కమిషనర్ పరిశీలించారు. అందులోని పూడికను పారిశుధ్య కార్మి కులచే తొలగించారు. తర్వాత జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని లబ్ధిదారులకు సూచించారు.

ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకోండి



పలమనేరు, ఆగస్టు3 : ఇసుకను అక్రమంగా నిల్వ చేసి ఉంచిన వారిపై చర్య లు తీసుకోవాలని ఆర్డీవో మనోజ్‌రెడ్డి తహ సీల్దార్ ఇన్బనాథన్‌ను ఆదేశించారు. మండలంలోని మొసలి మడుగు వద్ద కొందరు ఇసుక డంపు ఏర్పాటు చేసుకుని విక్రయించేందుకు సిద్ధం చేశారు. ఈ విషయంపై కొందరు ఆర్డీవో దృష్టికి తీసు కెళ్లారు. స్పందించిన ఆర్డీవో ఇసుక డంపులు స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు.

ఎమ్మెల్యే అమర్‌ను కలిసిన అధికారులు



పలమనేరు, ఆగస్టు3 : పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని శనివారం పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం జిల్లా జైళ్ల సూపరింటెండెంట్ వేణు గోపాల్ రెడ్డి, గంగవరం తహసీల్దార్ జి.ఎల్.శివకుమార్, పెద్దపంజాణి తహసీల్దార్ ఎం.ఎస్. ప్రసన్న కుమార్‌లు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

కుప్పంలో పెనుశబ్ధంతో కలకలం

కుప్పం, ఆగస్టు 3: కుప్పంలో శనివారం హఠాత్తుగా ఏదో పెద్ద బాంబు పేలినట్లు వినిపించిన పెనుశబ్ధం తీవ్ర కలకలం సృష్టించింది. కుప్పం పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల జనం ఇళ్లనుంచి బయటకు పరుగులు పెట్టారు. దీనిపై పలు పుకార్లు రేగాయి. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఢాం అంటూ పెద్ద శబ్దం వినిపించింది. ఉలిక్కిపడిన మండలం లోని జనం ఇళ్లనుంచి పరుగులు తీశారు. ఇతర ప్రాంతాలకు ఫోన్లు చేసి అక్కడ కూడా శబ్దం వినిపించేందేమోనని ఒకరినొకరు ఆరా తీశారు. అంతకు ముందు ఒక హెలిక్యాప్టర్‌తోపాటు, జెట్ ఫ్లయిట్ ఒకటి కుప్పం మీదుగా చక్కర్లు కొట్టడం గమనించిన స్థానికులు వాటినుంచి ఎవరో బాంబు వేశారని ఊహాగానాలు చేశారు. నడిమూరు పరిసర గ్రామాల ప్రజలైతే జెట్ ఫ్లయిట్‌నుంచి బాంబు అటవీ ప్రాంతం మధ్యలో పడడం తాము చూశామని చెప్పుకొచ్చారు. మరికొందరు క్వారీలలో పేలుడు జరిగిందని, సమీప గ్రామా లు కూడా ఈ పేలుడుకు ధ్వంసమై ఉంటాయని ప్రచారం చేశారు. ఒకదాని కొకటి పొంతనలేని ఈ వదంతులు కుప్పం మండల ప్రజలలో తీవ్రమైన భయాందోళనలు సృష్టించాయి. పేలుడు శబ్దం వినిపించినట్లు భావించిన అటవీ ప్రాంతంవైపు కొంతమంది పల్లె ప్రజలు వెళ్లి, బాంబు పేలుడు ఆనవాళ్లకోసం వెదకులాడారు. అయితే సాయంత్రం దాకా వెదకులాడినా పేలుడుకు సంబంధించిన ఆనవాళ్లు ఎవరికీ కనిపించలేదు. దీనిపై కుప్పం అర్బన్ సీఐ జీకే.నాయుడును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తమిళనాడు రాష్ట్రం జిల్లా కేంద్రమైన కృష్ణగిరి వద్ద ఆర్మీ విన్యాసాల్లో భాగంగా షై బాస్ట్ జరిగిందని చెప్పారు. ఆ శబ్దమే ఇక్కడిదాకా వినిపించిందన్నారు. దీనిపై ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

చౌడేపల్లె తహసీల్దార్‌గా హనుమంతు



చౌడేపల్లె, ఆగస్టు3: స్థానిక తహసీల్దార్‌గా హనుమంతు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో సమా వేశం నిర్వహించి, అందరు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచిం చారు. డీటీ మాధవి, వీర్‌వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

సదుం తహసీల్దారుగా మారుఫ్ హుస్సేన్

సదుం, ఆగస్టు 3: సదుం తహసీల్దారుగా మారుఫ్ హుస్సేన్ నియమితులయ్యారు. చిత్తూరు కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఆయన బదిలీపై వచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

చెత్త రహిత మున్సిపాలిటీయే లక్ష్యం

- ఇంటింటికీ వెళ్లి సేకరణ
- చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా కుప్పం అభివృద్ధి
- ఆంధ్రజ్యోతితో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు



కుప్పం, ఆగస్టు 3: కుప్పాన్ని చెత్త రహిత మున్సి పాలిటీగా తీర్చిదిద్దడానికి అవసరమైన చర్యలు తీసుకుం టున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. అందులో భాగంగానే ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు ఆశయాలకు అనుగుణంగా మున్సిపాలిటీని రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి అవవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తామని చెప్పారు. ఆంధ్రజ్యోతికి శనివారం మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు ఇవీ..

?. మీరు కొత్తగా వచ్చారు. మున్సిపాలిటీ మీద అవగాహన వచ్చిందా.

!. నిజమే, నేను కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా వచ్చి సుమారు 15 రోజులు మాత్రమే అయింది. కానీ ఇప్పటికే వార్డులన్నింటినీ చుట్టేశాను. పారిశుద్యానికి సంబంధించి ఎక్కడ ఎటువంటి పరిస్థితులున్నాయో ఒక అవగాహనకు వచ్చాను.

?. మరి పారిశుధ్య నిర్వహణ విషయంలో మీరు ప్రణాళిక ఏమిటి.

!. ప్రజలు ఆరోగ్యవంతంగా జీవించాలంటే పరిసరాల శుభ్రత ఎంతో అవసరం. నేను కమిషనర్‌గా బాధ్యతలు తీసుకోగానే ముందుగా పారిశుధ్యంపై దృష్టి పెట్టాను. ఉదయం 5 నుంచి 9 గంటలదాకా నేను వార్డుల్లోనే ఉంటున్నాను. మస్టర్ వేయడం మొదలు వీధుల్లో చెత్త తీసివేసే దాకా పర్యటిస్తాను. మళ్లీ రాత్రివేళ పదిమందితో ప్రధానమైన మార్కెట్టు వీధుల్లో శుభ్రం చేయిస్తున్నాను.

?. చెత్త సేకరణ కార్యక్రమం ఎలా జరుగుతోంది.

!. గతంలో స్వచ్ఛ భారత్ పేరుతో ఇంటింటికీ డస్ట్ బిన్లు పంచిపెట్టారు. ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించడమనే కార్యక్రమం కూడా మొదలు పెట్టారు. ఎందుకో ఆ కార్యక్రమం క్రమేణా మూలన పడినట్లు ఉంది. కానీ నేను వచ్చాక ఇంటింటినుంచి చెత్త సేకరణ అనే కార్యక్రమాన్ని ప్రారంభించాను. నేనే స్వయంగా వార్డులకు వెళ్లి ఈ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నాను. ఈ విషయంలో మెప్మా, ఆశా వర్కర్ల సహాయ సహకారాలు తీసుకుంటున్నాను. ప్రతి ఇంట్లోనూ చెత్త బుట్టలు ఉంచి అందులోనే చెత్త వేయాలని మున్సిపల్ సిబ్బంది వచ్చి తీసుకువెళ్తారని చెబుతున్నాము.

?. మరి ప్రజలనుంచి స్పందన ఎలా ఉంది.

!. చాలా బాగుంది. ముఖ్యంగా మహిళలు చెత్తసేకరణ కార్యక్ర మానికి బాగా సహకరిస్తున్నారు. వారు డస్ట్ బిన్స్ ఇంటివద్దే పెట్టి, చెత్త బండి రాగానే అందులో వేస్తున్నారు. అలాగే పూల మార్కెట్టు, ఆర్టీసీ బస్టాండు వద్ద గల వ్యాపారులు, దుకాణదారుల నుంచి కూడా బాగానే సహకారం అందుతోంది.

?. తగినన్ని వాహనాలు, సిబ్బంది ఉన్నారా.

!. నిజం చెప్పాలంటే పారిశుధ్య నిర్వహణకు ప్రస్తుతమున్న సిబ్బంది సరిపోవడం లేదు. ఇంకా అదనంగా 30 మంది అవసరమవుతారు. కానీ ఉన్న సిబ్బందితోనే సర్దుకు పోతున్నాము. ఇక వాహనాల విషయానికి వస్తే పాత ట్రాక్టర్లు 7 ఉన్నాయి. నేను వచ్చాక అదనంగా మరో 5 ట్రాక్టర్లను తెప్పించాను. ఇవిగాక 10 ఆటోలు ఉన్నాయి. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించడానికి ఈ వాహనాలు దాదాపు సరిపోతున్నాయి.

?. డీకేపల్లెలోని డంపింగ్ యార్డ్‌లో చెత్త చాలా ఎక్కువగా పేరుకు పోయింది. వర్షమొచ్చినపుడు వాననీళ్లు ఈ చెత్తతో కలిసి మురు గునీరుగా మారి సమీపంలోని డీకేపల్లె చెరువులోకి వెళ్లి కలిసి, తాగునీటి కలుషితం అవుతోంది. ఈ సమస్య నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోనున్నారు.

!. మీరు చెప్పిన సమస్య ఉన్నమాట నిజమే. డంపింగ్ యార్డులో పేరుకుపోయి గాలి, నీటి కాలుష్యానికి కారణమవుతున్న చెత్తను రీ సైక్లింగ్ చేసి, ఎరువుగా మార్చే ప్రణాళిక ఇంతకుముందు అమలైంది. ఇప్పుడు కూడా తడి, పొడి చెత్తను వేరుచేసి రీ సైక్లింగ్ యూనిట్ ఏర్పాటు చేసి ఎరువుగా మార్చేందుకు అవసరమైన చర్యలు తీసు కుంటాము. ఈ ఎరువును విక్రయించడం ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం కూడా చేకూరుతుంది.

?. మున్సిపాలిటీ అభివృద్ధికి ఇంకా ఏమేం ప్రణాళికలు ఉన్నాయి.

!. కుప్పం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమనేది ముఖ్యమంత్రి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీలు ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేసుకుని వెళ్తున్నారు. నా పరిధిలో నేను కూడా వారి సహకారాలతో మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాను. కుప్పం మున్సిపల్ అభివృద్ధికి ముఖ్యమంత్రి ఇప్పటికే రూ.2.50 కోట్లు గ్రాంటు ప్రకటించారు. రోడ్లు, కాలువల నిర్మాణం, ఉద్యానవనాల అభివృద్ధి వంటివి ప్రతిపాదనలు ఇప్పటికే తయారు చేశాము. ప్రభుత్వానికి ఈ ప్రతిపాదనలు పంపి, టెండర్ల ద్వారా ఆయా అభివృద్ధి పనులు రెండుమూడు నెలల్లో చేపడతాము. మోడల్ మున్సిపాలిటీగా తీర్చి దిద్దడానికి ప్రజల సహకారంతో నిరంతరం ముందుకు సాగుతాము.

సుబ్రహ్మణ్యస్వామి సేవలో ఎమ్మెల్సీ కంచర్ల

గుడుపల్లె, ఆగస్టు 3: మండల పరిధిలోని గుడివంక కొండపై వెలసిన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆడి పద్దెనిమిది పురస్కరించుకొని స్వామి వారి ఉత్సవాల్లో పాల్గొన్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలును సమర్పించారు. ఆలయ కమిటీ వారు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. టీడీపీ మండ లాధ్యక్షుడు బాబునాయుడు, నాయకులు రాజాగోపాల్, సుబ్రహ్మణ్యం, గోపాల్, భానుమూర్తి, రామ మూర్తి, అర్చకులు, వీరశేఖరయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

గుడుపల్లె, ఆగస్టు 3: మండల పరిధిలోని పెద్దబదన వాడలోని నెలకొన్న శ్రీవళ్లీ దేవ సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆడి పద్దెనిమిది ఉత్సవాల సందర్భంగా శనివారం కుప్పం బీఆర్‌డీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ శిబిరంలో 155 మందికి చికిత్సలు అందించారు. ఉచితంగా మందులను అందజేశారు. డాక్టర్ దేవేంద్ర నాయుడు, పీఆర్‌వో శ్రీనివాస్ మణి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా పుస్తకాల పంపిణీ

గుడుపల్లె, ఆగస్టు 3 సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌ల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంత గానో కృషి చేస్తుందని మండల పార్టీ అధ్యక్షులు తెలిపారు. శనివారం వారు గుడుపల్లె ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణమనాయుడు, హేమాంబర్ గౌడ్, భానుమూర్తి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అయ్యప్ప సేవలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

సదుం, ఆగస్టు 3: అయ్యప్ప మాలధారణలో ఉన్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం ఎర్రాతివారి పల్లెలోని అయ్యప్పస్వామిని ఆయన సోదరుడు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డితో కలిసి దర్శించుకున్నారు.

సేవ చేద్దాం.. మన్ననలు పొందుదాం

కల్లూరు, ఆగస్టు 3: ప్రజలకు మెరుగైన సేవలందించి వారి మన్ననలు పొందాలని జడ్పీటీసీ సభ్యులు మురళీధర్ తెలి పారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో శని వారం మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో మండల అభి వృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామన్నారు. గ్రామ పంచా యతీల్లో నెలకొన్న సమస్యలను చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. మండలాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మండల పర్యటనలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేదా ్మన్నారు. ఎంపీడీవో సురేష్‌బాబు, ఈఓపీఆర్డీ యుగంధర్, ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, ఏపీఓ షౌకత్‌అలీ పాల్గొన్నారు.

ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య

కుప్పం, ఆగస్టు 3: కుప్పంలో ఓ ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడు కథనం మేరకు.. తిరుపతి జిల్లా భాకరా పేటకు చెందిన ఉదయ్‌కుమార్ (27) కుప్పం పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో పర్సనల్ లోన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఇంకా పెళ్లికాలేదు. ఇతడు వజ్రవేలుశెట్టి వీధిలోని శ్రీసాయి ప్లాజాలోని మూడవ అంతస్తుల్లో నివాసం ఉంటున్నాడు. శనివారం విధులకు వెళ్లలేదు. సహచర ఉద్యోగులు ఇంటి వద్దకు వచ్చారు. ఎంత పిలిచినా తలుపు తీయకపోవడంతో అనుమానంతో తలు పులు బద్దలు కొట్టి చూశారు. ఉదయ్‌కుమార్ ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బకాయిలు చెల్లించకుంటే కనెక్షన్ కట్

కుప్పం, ఆగస్టు 3: రెస్కో పరిధిలో విద్యుత్తు బకాయిలను వినియోగదారులు చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేస్తామని జేసీ శ్రీనివాసులు హెచ్చరించారు. ఇందులో భాగంగా రూ.10వేలు అంతకన్నా ఎక్కువ బకాయిలు ఉన్న వారికి విద్యుత్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు సమచార శాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

కోళ్లఫారంలో 1100 కోళ్లు మృతి



చౌడేపల్లె, ఆగస్టు3: కోళ్లఫారాల ఎరువుల వ్యర్థాలతో తన కోళ్ల ఫారంలో 200 కోళ్లు మృతి చెందా యని ఓ ఫారం యజమాని ఆరో పించారు. బాధిత రైతు కథనం మేరకు.. మండలంలోని కాటిపేరి పంచాయతీ కావలివారిపల్లెకు చెందిన చంద్ర 3500 కోళ్ల సామర్థ్యంతో వీహెచ్‌ఎల్ కంపెనీ వారి కోళ్ల మేపుతూ జీవిస్తున్నాడు. ఆయన షెడ్ సమీపంలో ప్రీమియర్ కోళ్లఫారం కంపెనీకి చెందిన కోళ్ల ఎరువుల వ్యర్థాల డంపింగ్ యార్డ్ ఉంది. కొంత కాలంగా ఎరువుల వ్యర్థాల ఆవిరి, వైరస్‌లతో తన కోళ్లు చనిపోతున్నాయని చంద్ర తెలియజేశారు. వారం రోజులుగా 1100 కోళ్లు చనిపోయాయని వాపోయాడు. ఇదిలా ఉండగా వైరస్‌తో కోళ్లు చనిపోయి ఉంటాయని తమ కంపెనీ ఎరువుల వ్యర్థాల వలన కాదని ప్రీమియర్ కోళ్లఫారాల జీఎం వెంకటరెడ్డి తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఎలక్ట్రీషియన్ మృతి



మృతదేహాన్ని పరశీలిసుతన్న సీఐ లింగప్ప

వి.కోట, ఆగస్టు 3: వి.కోట - కుప్పం రహదారిలో పడిగలకుప్పం క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కుప్పానికి చెందిన ఎలక్ట్రీషియన్ సందాని (38) దుర్మరణం చెందాడు. శనివారం బంధువుల ఇంటికి వచ్చి కుప్పంకు ద్విచక్ర వాహనంలో తిరుగు పయనంలో ఉండగా పడిగలకుప్పం క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న టెంపో ప్రమాదవశాత్తూ ఢీకొంది. ఈ ఘటనలో సందాని అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ లింగప్ప ఘటనా స్థలాన్ని పరిశీలించరు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నామినేటెడ్ పదవుల్లో జనసేనకు 40 శాతం

కల్లూరు, ఆగస్టు 3: ఎన్డీయే కూటమిలో భాగంగా నామినేటెడ్ పదవుల్లో జనసేన పార్టీకి 40 శాతం కల్పించేలా పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ కృషి చేస్తున్నారని పుంగనూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ చిన్నరాయల్ తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరులో ఆ పార్టీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేటెడ్ పదవులను ఆశించే జనసేన పార్టీ నాయకుల దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్య కర్తల సంక్షేమానికి పవన్‌కళ్యాణ్ నిరంతరం కృషిచేస్తారని తెలిపారు. అనంతరం పలువురు జనసేన పార్టీ నాయకులను సన్మానించారు. జనసేన పార్టీ జిల్లా సమన్వయ కర్త పోకల జనా ర్ధన్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు చంద్రబాబు, నాయకులు మునేష్, మనోహర్, వెంకీ, శివ, గంగాధర్, శేఖర్, గిరి, సతీష్, రమేష్, మురళి, జయప్రకాష్, హరి, మధు పాల్గొన్నారు.

కేరళ వయనాడ్ ప్రజలకు అండగా నిలుద్దాం



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

పలమనేరు, ఆగష్టు3 : కేరళ వరద బాధితులను ఆదుకోవాలని శనివారం పలమనేరులో సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపునిచ్చారు. పలమనేరులో సీపీఎం నాయకులు కేరళ వయనాడ్ బాధితులకు విరాళాలు సేకరించే కార్య క్రమం చేపట్టారు.ఈ కార్యక్ర మంలో సీపీఎం నాయకులు గిరిధరగుప్తా, ఓబుల్‌రాజు, భువనేశ్వరి, ఈశ్వరయ్య, ధనలక్ష్మి, లక్ష్మయ్య, సంజయ్ పాల్గొన్నారు. ● వయనాడ్ ప్రాంతంలో కొండచరియలు విరిగి పడినఘటనను జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించాలని ఇక్కడి మానవహక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ నాయకులు డీవీముని రత్నం విజ్ఞప్తిచేశారు.

రాయలచెరువు వంకలోని ఇంటి పట్టాలు రద్దు చేయాలి

పుంగనూరు, ఆగస్టు 3: పుంగనూరులోని రాయలచెరువు వంకలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమకట్టడాలను కూల్చివేయాలని, రెవెన్యూ అధికారులు మంజూరు చేసిన ఇంటి పట్టాలను రద్దు చేయాలని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు పి.అయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాయలచెరువు మొరవనీరు స్థానిక దోబీ కాలనీ మధ్యలో ప్రవహిస్తోందని, వర్షాలు అధికంగా కురిస్తే నీరు ఇళ్లలోకి వెళ్లి ప్రమాదం జరి గే అవకాశాలు ఉన్నాయన్నారు. వంకలో అక్రమంగా పట్టాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణాలు చేయించిన అధికారులపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ సుమిత్‌కుమార్ చర్యలు తీసుకోవాలని కోరారు. పుంగనూరులో వైసీపీ నాయకులు ఆక్రమించిన స్థలాలపై విచారించి చర్యలు తీసుకోవాల న్నారు. ఈ విషయం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతామన్నారు.

మదర్‌థెరిస్సా కళాశాల అధ్యాపకులకు డాక్టరేట్లు

గంగవరం, ఆగస్టు3: మదర్‌థెరిస్సా కళాశాలకు చెందిన ఇద్దరు అధ్యాపకులకు తమిళ నాడులోని విట్ యూనివర్సిటీ వారు డాక్టరేట్లు ప్రదానం చేసినట్లు కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. ఈసీఈ విభాగంలో పనిచేస్తున్న నవీన్‌కుమార్ గణిత శాస్త్రంలో 'ఇన్‌స్టిట్యూషన్ ఎఫ్‌యు33వై గ్రాఫ్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. అనిల్‌కుమార్ 'ఇన్వెస్టిగేషన్ ఆన్ సెమాంటిక్ సెగ్మెంటేషన్' అను అంశంపైన పరిశోధనలు చేశారు. దీంతో వారికి డాక్టరేట్లు అందజేశారు. కళాశాల ఛైర్మన్ సునీల్‌కుమార్, అకడమిక్ డైరక్టర్ రాజేంద్రప్రసాద్, సహచర అధ్యాపకులు అభినందలు తెలిపారు.

బోధన ఆసక్తిగా ఉండాలి

సోమల, ఆగస్టు 3: ప్రభుత్వ బడుల్లోని ఉపాధ్యాయుల బోధన ఆసక్తిగా ఉండాలని ఎంఈవో శివరత్న సూచించారు. శనివారం నంజంపేట, సరస్వతీపురం పాఠశాలలను ఆమె సందర్శించారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నిర్వహణ తదితర అంశాలను ఉపాధ్యాయులతో సమీక్షించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచు కోవాలని సూచించారు. చెన్నకేశవులు, సురేశ్, అమృత తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

సోమల, ఆగస్టు 3: కూటమి ప్రభుత్వం రైతులకు అన్ని వేళలా అండగా నిలుస్తుందని జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్ తెలిపారు. శనివారం నంజంపేట ఆర్బీకేలో పలువురు రైతులతో కలసి డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తులు అందజేశారు. అర్హులైన ప్రతి రైతుకు డ్రిప్ పరికరాలు అందజేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రైతులకు జీలుగ, జనుము విత్తనాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.

చల్లా బాబును కలిసిన తహసీల్దార్



కల్లూరు, ఆగస్టు 3: పుంగనూరు నియోజక వర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబును ఆయన నివాసంలో పులిచెర్ల తహసీల్దార్ జయ సింహ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సన్మా నించారు. ఈ సందర్భంగా చల్లా బాబు మాట్లాడుతూ రెవెన్యూలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

వడ్డిపల్లె విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

సోమల, ఆగస్టు 3: సోమల పీహెచ్‌సీ వైద్యపరిధిలోని పలు పాఠశాలల్లో వైద్యాధికారి ప్రదీప్ కుమార్‌రెడ్డి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వడ్డిపల్లె పాఠశాలలో ఆరోగ్యపరీక్షలు జరిపారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధచూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్రమణ్యం, సీహెచ్‌వో అమరనాథ్, మదనిక, శివరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి అభిషేకపూజలు

సోమల, ఆగస్టు 3: సోమల పంచాయతీ చెన్నయ్యగారి పల్లెలో కొలువుదీరిన చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం ఉభయదారులు మూలవిరాట్‌కు వివిధ రకాల పుష్పాలతో అలంకరణలు చేశారు. పలు గ్రామాల భక్తు లు స్వామివారిని దర్శించుకున్నారు. సోమల, చెన్నయ్య గారిపల్లె, దిడ్డివారిపల్లె, గన్నావారిపల్లెకు చెందిన భజన సంఘాల సభ్యులు సంకీర్తనలు ఆలపించారు. ఉభయ దారులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రొంపిచెర్ల మండల మీట్ వాయిదా

రొంపిచెర్ల, ఆగస్టు 3: రొంపిచెర్ల మండల సర్వసభ్య సమావేశం రెండవ సారి వాయిదా పడినట్లు ఎంపీడీవో రెడ్డెప్పఆచారి తెలిపారు. గత నెలలో మొదటిసారి నిర్వహించిన మండల మీట్ కోరం లేక వాయిదా పడింది. శనివారం రెండవ పర్యాయం నిర్వహించతలపెట్టగా ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం లేకపోవడంతో సమావేశం వాయిదా పడింది. తర్వాత సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని ఎంపీడీవో తెలిపారు.

అర్చకులు రామమూర్తి మృతి

బైరెడ్డిపల్లె, ఆగస్టు 3 : బేలుపల్లెలోని సత్యనారాయణ స్వామి ఆలయ అర్చకులు రామమూర్తి(71) శనివారం మృతిచెందారు. బ్రాహ్మణసమాఖ్య ప్రతినిధులు మురళీ కృష్ణ, శ్రీనివాసమూర్తి, శేఖర్, మురళీధరాచార్యులు, సుబ్బారావు, రవి సంతాపం తెలిపారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి

చౌడేపల్లె, ఆగస్టు3:అభివృద్ధే లక్ష్యంగా మండల స్థాయి అధికారులు పనిచేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణవేణితో కలసి మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ప్రజల సమస్యలు అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. ఏపీవో శ్రీనివాసులు, ఎంఈవో కేశవరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆడిపద్దెనిమిది వేడుకలు

రామకుప్పం, ఆగస్టు 3: మండలంలోని పాలరేవుగడ్డ శనివారం ఆడిపద్దెనిమిది పర్వదినం సందర్భంగా భక్తజనసంద్రమైంది. బాలమురుగన్ ఆలయ ఆవరణం హరోంహర నామస్మరణతో మార్మోగింది. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గాలతో బాటూ తమిళనాడు సరిహద్దు ప్రాంతాల నుంచి ఉదయం నుంచే భక్తులు బాల మురుగన్ దర్శనార్థం తరలివచ్చారు. పలువురు భక్తులు కావళ్ళ సమర్పించారు. మరికొందరు వీపునకు కొక్కీలు తగిలించుకుని తీర్లు లాగుతూ, క్రేన్‌లకు వేలాడుతూ, దవడలకు శూలాలు గుచ్చుకుని మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్, తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శులు పత్రనారాయణాచారి, నాగభూషణం తదితరులు దాతల సహకారంతో భక్తులు అన్నదానం చేశారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హరికథాలాపనలు భక్తులను అలరించాయి.



పెద్దబదనవాడలో దవడకు శూలం గుచ్చుకొని వస్తున్న భక్తుడు, పాలరేవుగడ్డ ఆలయం వద్ద భక్తుల సందడి

గుడుపల్లె: మండల పరిధిలోని పెద్దబజన వాడలో వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఆడి పద్దెనిమిది వేడుకలు వైభవంగా జరిగాయి. వేద పండితులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వ హించారు. స్వామి వారిని పట్టువస్త్రాలు ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు కావళ్లు సమర్పించారు. పలువురు భక్తులు దవడకు శూలం గుచ్చుకొని, శరీరం మొత్తం నిమ్మకాయలు గుచ్చుకొని, వీపునకు గుచ్చుకొన్న కొక్కీలతో తేరును లాగుతూ ఆలయంలో మొక్కులు చెల్లించారు. కాగా ఆలయ ప్రాంగణంలో వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ మూర్తులను ఆలయ వీధుల్లో ఊరేగించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

గాంధీ సర్కిల్‌ను తనిఖీ చేసిన కమిషనర్



చిత్తూరు, ఆగస్టు 3: స్థానిక గాంధీ సర్కిల్, మిట్టూరులోని మునస్వామి నాయుడు మున్సిపల్ పార్కులను శనివారం కమిషనర్ అరుణ తనిఖీ చేశారు. మునస్వామి నాయుడు పార్కులో ఇంజనీరింగ్, శుభ్రతా పనులను పరిశీలించారు. ఫుట్‌పాత్, మొక్కల పెంపకం, పిల్లలు ఆడుకునే పరికరాలు, చెట్ల వద్ద బల్లలు ఏర్పాటు చేయాలన్నారు. పార్కు బయట ఆక్రమణలను తొలగించి, పార్కింగ్ కోసం సిద్ధం చేయాలన్నారు. వాకింగ్ ట్రాక్‌పై సమీక్షించారు. అపోలో సౌజన్యంతో బస్ షెల్టర్ నిర్మాణంపై చర్చించారు. సహాయ కమిషనర్ రామకృష్ణుడు, అపోలో సీఈవో నరేష్‌రెడ్డి, డీఈ రమణ, టీపీవో శారద పాల్గొన్నారు.

ఎస్సీల వర్గీకరణపై హర్షాతిరేకం



స్వీట్లు పంచుతున్న మందకృష్ణ అనుచరులు

విజయపురం, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణపై మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో శనివారం మందకృష్ణ మాదిగ అనుచరులు సంతోషం వ్యక్తం చేశారు. రెవెన్యూ కార్యాలయ సిబ్బందికి వారు స్వీట్లు పంచారు. జిల్లా ప్రధాన కార్యదర్శి యాదాల సూర్య, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వావిల శివయ్య, మండల ఇన్‌చార్జి మునివరాలు, జిల్లా కార్యదర్శి మునివేలు, నగరి సీనియర్‌నాయకుడు శివప్రసాద్, అయ్యప్ప, పురుషోత్తం, యువరాజ్, గిరి, రమేష్, మహేష్, మునికృష్ణా పాల్గొన్నారు.

ఈహెచ్‌సీ పరిధి రూ.5 లక్షలకు పెంచాలి : ఆపస్



మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆపస్ నాయకులు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 3: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఉచిత వైద్య సదుపాయాలు ఎంప్లాయిస్ హెల్త్ స్కీం (ఈహెచ్‌సీ) అమలులో సమస్యలు పరిష్కరించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ శనివారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కోరారు. ఆయనను కలిసి వినతి పత్రం అందించారు. ఈహెచ్‌సీ ట్రీట్మెంట్‌కు ప్రైవేటు హాస్పిటల్స్‌లో స్పందన లేదన్నారు. దీని పరిధి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడంతో పాటు బిల్లుల సమర్పణ గడువు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

వేరుశనగ సాగులో జిప్సంతో అధిక దిగుబడి



రైతులకు సూచనలిస్తున్న నాగపద్మిని

తవణంపల్లె, ఆగస్టు 3: వేరుశనగ సాగులో కలుపు తీసే ముందు జిప్సం ఎరువు వాడితే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ నాగపద్మిణి తెలిపారు. శనివారం టి.పుత్తూరులో వేరుశనగ పంటను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంటలో రెండోవ సారి కలుపు తీసే ముందు ఎకరాకు 200 కిలోల జిప్సం వాడకం వలన నాణ్యమైన అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. చీడపీడల నివారణకు కంచె పంటను వేసుకోవాలన్నారు. ఏవో ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఛాంబర్‌ను ప్రారంభించిన కలెక్టర్



చిత్తూరు రూరల్, ఆగస్టు 3: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే ఛాంబర్‌ను శనివారం ఎమ్మెల్యే గురజాలతో కలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రారంభించారు. నంతరంఛాంబర్‌లో వేదపండితులు పూజలు నిర్వహించారు. కలెక్టర్, జేసీలను ఎమ్మెల్యే సన్మానించారు.

నేడు పెనుమూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

పెనుమూరు, ఆగస్టు 3: తిరుపతిలోని మాధురి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి మేనేజరు రవి పేర్కొన్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఎముకలు, కీళ్లు, యూరాలజీ, న్యూరాలజీ, డెంటల్ విభాగాల డాక్టర్లు అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ క్యాంపు నిర్వహిస్తామన్నారు.

నేడు యోగా శిక్షణా పరిచయ కార్యక్రమాలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 3: నగరంలో ఆదివారం వివిధ పాఠశాలల్లో సిద్ధి సమాధి యోగా శిక్షణ పరిచయ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నరేంద్రకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరింపేటలో ప్రాణయామం, ధ్యానం, యోగసనాలు, సూర్య నమస్కారాలు తదితర అంశాలపై యోగాభ్యాసకులకు శిక్షణ పరిచయ కార్యక్రమాలు చేపడుతున్నట్లు యోగా గురువులు బ్రహ్మయ్య, సుబ్రమణ్యంరెడ్డి, జగన్నాథ్‌లు తెలిపారు.

ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జయప్రకాష్‌నాయుడు

తవణంపల్లె, ఆగస్టు 3: స్కూలు మెనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంత నిర్వహించాలని నియోజకవర్గ స్కూలు మెనేజ్మెంట్ ఏన్నికలు ఇన్‌ఛార్జి జయప్రకాష్‌నాయుడు తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులకు స్కూలు మెనేజ్మెంట్ ఏన్నికలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 8న మండలంలోని అన్ని పాఠశాలల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో త్యాగరాజులురెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సుబ్రమణ్యం

పెనుమూరు, ఆగస్టు 3: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చిన్న సన్నకారు రైతులు, 5 ఎకరాలు లోపు భూమి కలిగిన రైతులు పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవచ్చని మండల ప్రత్యేకాధికారి సుబ్రమణ్యం తెలిపారు. శనివారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, హార్టికల్చర్, సిరికల్చర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణలో 90 రోజులు పని దినాలు దశలవారిగా బిల్లులు మంజూరు చేయాలన్నారు. మామిడి, అల్లనేరేడు, జామ, సపోటా, దానిమ్మ మొక్కలు నాటుకున్న రైతులకు తోట సరిహద్దుల్లో కొబ్బరి అల్లనేరేడు మొక్కల పెంపకానికి అర్హులు ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, ఏపీవో గుణశేఖర్, ఇసీ సతీష్, టీఏలు వినోద్, సతీష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సు బోల్తా
● 13మందికి స్వల్ప గాయాలు

బంగారుపాళ్యం, ఆగస్టు 3: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని మొగిలి ఘాట్‌లో శనివారం వేకువజామున 2.30 గంటలకు ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 13మందికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బెంగళూరు నుండి నెల్లూరు వైపుగా ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు శనివారం తెల్లవారుజామున మొగిలి ఘాట్‌కు చేరుకోగానే అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో డ్రైవర్‌తో సహా 13 మందికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు, నిందితులతో పోలీసులు

తవణంపల్లె, ఆగస్టు 3: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఎగువతవణంపల్లె పైనగుండ్లపల్లె సమీపంలో బాహూదానది నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న హరి, చినస్వామి, వినాయగంలను అదుపులోకి తీసుకొని ట్రాక్టర్లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఖాతాదారుడు మరణిస్తే బీమా



మృతుని భార్యకు చెక్కు అందిస్తున్న ప్రభాకరణ్

పెనుమూరు, ఆగస్టు 3: ఖాతాదారుడు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి బీమా చెల్లిస్తున్నామని సప్తగిరి బ్యాంకు జనరల్ మేనేజరు ప్రభాకరణ్ తెలిపారు. కార్తికేయపురానికి చెందిన హరికృష్ణ ఐదు నెలల క్రితం పాముకాటుకు గురై మృతి చెందితే మృతుని కుటుంబానికి బీమాగా రూ.5లక్షలు శనివారం అందజేశామన్నారు. సంవత్సర ప్రీమియం రూ.177 చెల్లిస్తే బీమా వర్తిస్తుందని ఆయన వివరించారు. బ్యాంకు మేనేజరు నాగరాజన్ పాల్గొన్నారు.

అమరావతికి రూ.లక్ష విరాళం



సీఎంకు విరాళం అందజేస్తున్న నేతలు

యాదమరి, ఆగస్టు 3: అమరావతి నిర్మాణానికి కీనాటంపల్లికి చెందిన టీడీపీ నేతలు వల్లేరు వెంకటేశులు నాయుడు, వల్లేరు అమరనాథ నాయుడులు రూ.లక్ష విరాళాన్ని అందించారు. శనివారం విజయవాడలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి చెక్కును అందజేశారు.

నాటు తుపాకీ స్వాధీనం

కార్వేటినగరం, ఆగస్టు 3: ముక్కరవాణి పల్లె వద్ద పక్షులను వేటాడానికి ఉపయోగించే నాటు తుపాకీని సీకాయ కాలనీకి చెందిన అర్జున్ నుంచి శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడ్ని అరెస్టు చేసినట్లు సీఐ సత్యాబాబు తెలిపారు.

నేడు చౌడేశ్వరిదేవి జయంతి వేడుకలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 3: గిరింపేట చౌడేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి వేడుకలునిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. చండీహోమం, పాలకలశాల సమర్పణ, అభిషేకం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది..

రైతులకు న్యాయమైన భూ పరిహారం

శ్రీరంగరాజపురం, ఆగస్టు 3: చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారికి భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేస్తామని ఆర్డీవో చిన్నయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల రెవిన్యూ కార్యాలయంలో చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారి భూ నిర్వాసితుల పరిహారంపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి భూములకు న్యాయమైన ధరలను అందిస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ అమర్నాథ్, డిప్యూటీ తహసీల్దార్ లోకనాథం పిళ్లై, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఊంజల్ సేవ

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 3: నగరపాలక పరిధిలోని 75 దొడ్డిపల్లె ఆర్యఅమ్మన్ ఆలయంలో ఆమావాస్య సందర్భంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఉయ్యాలలో అధిష్టించి ఊంజల్‌సేవ నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు అమ్మవారి పసుపు కుంకుమ తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి, గ్రామస్థులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో బాబా భజన

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 3: నగరంలోని తపోవనం రాస్ వృద్ధాశ్రమంలో శనివారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సత్యసాయి భజనమండలి సభ్యులు భజన సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు సత్యసాయి భోధనలను వివరించారు. అనంతరం బాబా ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సత్యసేవాసమితి, భజనమండలి, బాలవికాష్ సభ్యులు పాల్గొన్నారు.

సబ్సిడీ బిందు సేద్య పరికరాలకు దరఖాస్తులు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 3: బిందు, తుంపర్ల సేద్యంపై ఆసక్తిగల రైతులకు 95శాతం సబ్సిడీతో పరికరాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రమణ్యం శనివారం ఓ ప్రకటనలో కోరారు. రైతు సంరక్షణ కేంద్రానికి రైతులు వెళ్లి పట్టాదారు పాసుపుస్తకం, ఆన్‌లైన్ వన్‌బీ, బ్యాంక్ ఖాతాపుస్తకం అందజేసి ఆన్‌లైన్‌లో చేసుకోవాలని సూచించారు.

వచ్చే నెల నుంచి పశుగణన ప్రారంభం: కలెక్టర్



పశుగణన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 3: గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కోట్లాది కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వం, పోషకభద్రత అందించడంలో పశువుల పెంపకం కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పశుసంవర్ధకశాఖకు చెందిన 21వ అఖిలభారత పశుగణన-2024 పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగణన జిల్లాలో సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు జరుగుతుందన్నారు. పూర్తిగణన 2025 ఫిబ్రవరితో ముగుస్తుందని చెప్పారు. ఇందుకోసం 67 మంది సూపర్‌వైజర్లు 568 మంది ఎన్యుమరేటర్లను ఎంపిక చేశామన్నారు. పశుగణన పర్యవేక్షణ కోసం జిల్లా నోడల్ అధికారిని నియమించినట్లు ఆయన చెప్పారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఐదేళ్ళకోసారి నిర్వహించే పశుగణన ఇంతవరకు 20 సార్లు నిర్వహించామన్నారు. పశుసంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.

మండలాల్లో తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

చిత్తూరు రూరల్, ఆగస్టు 3: తహసీల్దార్‌గా కళావతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కోసం చిత్తూరు తహసీల్దార్‌గా వచ్చి శ్రీనివాస రెడ్డి తిరిగి సొంత జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పెనుమూరు తహసీల్దార్ కళావతిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. **ఐరాల:** ఐరాల మండల తహసీల్దార్‌గా మహేష్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. పెనుమూరు మండలంలో డిప్యూటి తహసీల్దార్‌గా పనిచేసిన ఈయన ఇక్కడికి ఎఫ్ఏసీగా వచ్చారు. ఇక్కడి తహసీల్దార్ శ్రీనివాసులు కర్నూలు జిల్లా గడివేములకు బదిలీపై వెళ్లారు. **బంగారుపాళ్యం:** మం డడల తహసీల్దార్‌గా బాబు రాజేంద్రప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో గుడిపాలలో పనిచేశారు. ఇక్కడి తహసీల్దార్ సుభద్రమ్మ కర్నూలు బదిలీ అయ్యారు. **పెనుమూరు:** పెనుమూరు తహసీల్దారుగా(ఎఫ్ఏసి) కళ్యాణి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఈమె గుడిపాల మండల డిప్యూటీ తహసీల్దారుగా పనిచేశారు. ఎన్నికలకు ఇక్కడికి వచ్చిన సుహద్రను అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు. **కార్వేటినగరం:** తహసీల్దారుగా భగవతి బాధ్యతలు స్వీకరించారు. **నింద్ర:** తహసీల్దార్‌గా శేషగిరిరావు బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసినా భగవతి బదిలీపై కడప జిల్లాకు వెళ్లారు. శేషగిరిరావును టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు. మాజీ డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశులు నాయుడు, నాయకులు వడివేలురెడ్డి, రవికుమార్, తంగవేలు, విజయ్‌కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. **పాలసముద్రం:** తహసీల్దార్‌గా అరుణకుమారి నియమితులయ్యారు.. ఇక్కడ పనిచేసిన బాబు రామకుప్పం బదిలీ అయ్యారు. **పూతలపట్టు:** మండల తహసీల్దార్‌గా గుర్రప్ప బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో కర్నూలు జిల్లా కోడుమూరులో పనిచేశారు. **శ్రీరంగరాజపురం:** తహసీల్దారుగా అమర్నాథ్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎనిచేసిన అల్ఫ్రెడ్ కర్నూలు జిల్లాకు వెళ్లారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 3:బిడ్డకు తల్లిముర్రుపాలు శ్రీరామరక్షగా ఆరోగ్యాన్ని కాపాడుతుందని చిత్తూరు అపోలో ఆసుపత్రి ఫౌండేషన్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రాంబాబు, సీడీపీవో వినతశ్రీ అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో చిత్తూరు అపోలో ఆసుపత్రి సహకారంతో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలపై శనివారం అంగన్‌వాడీ టీచర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలుగా ఉన్నపుడు సమతుల్యమైన నాణ్యతగల ఆహారం తీసుకుంటే శిశువులు ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. . తల్లిపాలతో బిడ్డలు ఎదుగుదల, మధుమేహం, రక్తహీనత తదితర అనారోగ్య సమస్యలు తలెత్తవని తెలిపారు. అపోలో ఫౌండేషన్ హెడ్ ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ గాయత్రి, ప్రోగ్రాం మేనేజర్ అగ్‌సా అనీస్ తదితరులు పాల్గొన్నారు. **గుడిపాల:** కొత్తపల్లి పంచాయతీ కిలారిపల్లిలో బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను రాణి, ప్రభుత్వ వైద్యాధికారులు వివరించారు. . **విజయపురం:** జగన్నాథపురంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త చాముండేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **పూతలపట్టు:** అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టర్లను విడుదల చేశారు. ప్రాజెక్టు అధికారి నిర్మల, సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి శాఖాపరంగా బృందాల ఏర్పాటు



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 3: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా అందిన అర్జీలపై ఎప్పటికప్పుడు స్పందించాలని జిల్లా రెవిన్యూ అధికారి పుల్లయ్య అన్నారు. శనివారం తన చాంబర్‌లో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. అర్జీల పరిష్కారానికి ప్రతి శాఖ ఒక బృందాన్ని ఏర్పాటు చేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. విధానపర, ఆర్థిక పరమైన అర్జీల నిర్ణయాలపై ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. డ్వామా పీడీ రాజశేఖర్, డీఆర్డీఏ, హౌసింగ్ పీడీలు తులసి, పద్మనాభం, డీఎల్డీవో రవికుమార్, డీఎస్పీ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

నగరపాలక కార్మికులకు ఉచిత వైద్య సేవలు

చిత్తూరు, ఆగస్టు 3: నగరపాలక సంస్థ పరిధిలోని పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల కార్మికులకు మెరుగైన వైద్యం అందించామని కమిషనర్ అరుణ చెప్పారు. శుక్ర, శనివారాల్లో కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 612 మంది కార్మికులకు వైద్య సేవలు అందించినట్లు ఆమె చెప్పారు. వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యపరమైన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు శిబిరాన్ని సందర్శించారు. సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ తదితరులు పాల్గొన్నారు.

స్వీపింగ్ మిషన్‌కు సాధారణ నిధుల చెల్లింపు

నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం శనివారం మధ్యాహ్నం జరిగింది. మేయర్ అముద, కమిషనర్ అరుణ, కమిటీ సభ్యులు రాజేష్‌కుమార్‌రెడ్డి, శశికుమార్, సుష్మ, అశోకగ్, నిర్మల పాల్గొన్నారు. స్వీపింగ్ మిషన్‌కు సాధారణ నిధుల నుంచి చెల్లించడానికి ఆమోదించారు. సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందడుగు: ఎమ్మెల్యే మురళి



పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, ఆగస్టు 3: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శనివారం పీఈఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆయన పాఠ్యపుస్తకాలను అందజేశారు. మారుమూల గ్రామాలనుంచివస్తున్న తమకు మధ్యాహ్న భోజనవసతి కల్పించాని పలువురు ఇంటర్ విద్యార్థులు ఆయన్ను కోరారు. తమకు మూడు నెలలుగా జీతాలు అందలేదని కాంట్రాక్టు అధ్యాపకులు, జూనియర్ లెక్చరర్లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ విషయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్‌పీ ధరణీ నాయుడు, జనార్దన్ గౌడ్, సర్పంచ్ ఉమాదేవి, మాజీ సర్పంచ్ క్రిష్ణమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ వందన త్రిపాఠి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కళాశాల క్రీడామైదానంలో బాస్కెట్ బాల్ శిక్షణా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు ఎన్‌పీ జయప్రకాష్‌తో కలసి కాసేపు బాస్కెట్ బాల్ ఆడారు.

మండల అభివృద్ధికి సహకరించండి: ఎమ్మెల్యే గురజాల



చిత్తూరు రూరల్, ఆగస్టు 3: మండల అభివృద్ధికి సభ్యులందరూ సహకరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కోరారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. నీటి ట్యాంకులు శుభ్రం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గీత, ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాఘవేంద్రవర్మ, ఏవో వేణగోపాల్ అధికారులు పాల్గొన్నారు.

డీఈవో వైఖరి మార్చుకోవాలని ఎస్టీయూ ఆందోళన



చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 3: డీఈవో అనుచిత వైఖరి మారాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధన్‌మోహన్‌రెడ్డి, మోహన్‌యాదవ్‌లు కోరారు. ఆయన వ్యవహార శైలికి నిరసనగా ఎస్టీయూ నేతలు, టీచర్లు శనివారం డీఈవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల పర్యటనల్లో పాఠశాలల్లోని సమస్యలను ప్రస్తావించడాన్ని తీవ్రంగా తప్పు పట్టడం సరికాదన్నారు. ఒకే సమస్యపై కొందరికి అనుకూలంగా మరి కొందరికి ప్రతికూలంగా వ్యవహరిస్తున్న తీరును విమర్శించా. సర్వీసు క్రమబద్ధీకరణ జాబితాను సరిచేసి విడుదల చేయాలన్నారు. ఫైళ్ల క్లియరెన్స్‌లో తీవ్ర జాప్యం జరుగుతుందని, అధికారుల తీరు మారకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గంటా మోహన్, హేమచంద్రారెడ్డి, శ్రీదేవి, పురుషోత్తం, దేవరాజులురెడ్డి, చంద్రన్, కిషోర్, లక్ష్మీపతి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పుష్పకైంకర్యం



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 3: స్థానిక గుర్రప్పనాయుడు వీధి అంకాల పరమేశ్వరి అమ్మవారికి ఆలయ అర్చకులు కుమార్ శనివారం పుష్ప కైంకర్యం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. భక్తులు అంబలి సమర్పించారు. వారికి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

జనసేన సభ్యత్వ నమోదుకు మంచి స్పందన



సభ్యత్వ నమోదులో యుగంధర్

వెదురుకుప్పం, ఆగస్టు 3: నియోజకవర్గ పరిధిలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన లభిస్తోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పొన్న యుగంధర్ అన్నారు. శనివారం మండలంలో పలు గ్రామాల్లో జనసైనికులతో కలసి వెళ్లి విస్తృతంగా క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. క్రియాశీలక సభ్యత్వం తీసుకోవడం కలిగే ప్రయోజనాలు తెలుసుకుని స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు బెనర్జీ, యతీశ్వర్‌రెడ్డి ఉన్నారు.

తుడా నిధులతో కొత్తచెరువు అభివృద్ధి

వెదురుకుప్పం గ్రామపంచాయతీలోనఇ కొత్త చెరువును తుడా నిధులతో అభివృద్ధిపరచడానికి చర్యలు చేపడుతున్నట్లు యుగంధర్ మీడియాకు చెప్పారు. ఈమేరకు. తుడాకు ప్రతిపాదన పెట్టామన్నారు. త్వరలో తుడా అధికార బృందం పరిశీలించి నిధులు కేటాయిస్తారన్నారు.

పక్కా ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు
● జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ రాజ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

గంగాధరనెల్లూరు, ఆగస్టు 3: హాస్టల్లో చదువుతున్న విద్యార్థులు పక్కా ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజ్యలక్ష్మి కోరారు. స్థానిక బాలుర హాస్టల్లో శనివారం వార్డన్లతో పాటు నాల్గవ తరగతి ఉద్యోగుల విధులు, బాధ్యతలపై శనివారం ఆమెసమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. వార్డన్‌లు నిరంతర పర్యవేక్షణతో చొరవ చూపాలని కోరారు. ఎఎస్‌డబ్ల్యూవో షకీలా, వార్డన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కార్వేటినగరం, ఆగస్టు 3: దిగువ ఎర్రమరాజుపల్లి సమీపంలో వైసీపీ పార్టీకి చెందిన ధనంజయరెడ్డికి చెందిన గ్రానైట్ క్వారీ వద్ద పేకాట స్థావరంపై శనివారం స్పెషల్ బ్రాంచ్, కార్వేటినగరం పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. పేకాడుతున్న పదిమందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు. వారి నుంచి రూ.1.61 లక్షల నగదుతో పాటు 5 కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.